# మనిషి



విహారి

ఆతను తూలుతూ ముందుకు కదిలేడు.

ఆమె బెదురుతూ వెనుకకు జరిగింది.

అతని కళ్లు ఎర్రగా నవ్వుతూ భయం వైపు చూశాయి.

ఆమె కళ్లు తెల్లగా తేలుతూ క్రౌర్యం వైపు చూశాయి.

అతని ముదురు పెదాలపై నిలచిన చిరునవ్వు అతనిలోని కోరికను వెదజల్లుతోంది.

ఆమె లేత పెదాలపై నిలచిన విషాదం ఆమెలోని తొట్రుపాటును, భయాన్ని చాటుతోంది.

ఆమె యిక వెనక్కు పోలేకపోయింది గోడ అడ్డుకుంది.

అతను ఆగలేదు. ఆగలేకపోయాడు. ఆమె...

'మీ కిది న్యాయం కాదు' అంది.

'కాదు' అన్నాడు.

'నన్ను అన్యాయం చేయకండి' అంది.

'...న్యాయం చేయను' అన్నాడు.

'మీరు మంచివారని, ఆపదల్లో వున్న వాళ్లను ఆదుకుని సాయం చేస్తారనీ విని వచ్చాను' అంది.

'చేస్తాను' అన్నాడు.

ఆమె నిస్సహాయంగా కళ్లు మూసుకుంది.

అతనికి కళ్లు మూసుకపోయాయి.

ఆపైన విన్పించింది, సర్వాన్నీ కోల్పోయిన అబల ఆక్రందన...

* * *

'మీతో కొంచెం పనుండి వచ్చాము. ఒక సారి బయటికి వస్తారూ?' చీకటిలాంటి ఆకారం పిల్చింది.

'ఏమిటి విశేషం. ఎవరు మీరు?' చీకట్లోకి నడిచారిద్దరూ.

'మే మెవరమైతే మీకేంకాని అభయరావంటే మీరేకదూ'?

'అవును...'

'అందమైన ఆడపిల్లలకు అండగా నిల్చి, వార్ని రౌడీలబారినుండి కాపాడుతుంటారు కదూ?'

'మీ రెవరో నాకు తెలీదు, మీ కేం కావాలో...'

'మీ ప్రాణం!'

ఖస్.. ఖస్...చీకట్లో దూసుకవచ్చాయి రెండు కత్తులు.

ఆపైన విన్పించింది మృత్యువును కౌగలించుకుంటున్న అభయరావు మూలుగు.

* * *

'పంతులూ! ఇంట్లోనే వున్నట్టున్నావే నాకోసమే నన్నట్లు. నాకు తెలుసు. అనుకున్నరోజుకు అనుకున్నట్లు నీవు బాకీ ఫైసల్ చేస్తావని'

'అనే అనుకున్నానండీ. కాని పరిస్థితులు విషమించాయండి. మరొక్క నెలరోజులు గడువిప్పించారంటే...'

'చాల్చాల్లేవయ్యా పెద్దమనిషి! మనిషికి మాట నిలకడ ఉండాలయ్యా. అది

లేనప్పుడు చచ్చినా బ్రతికినా ఒకటే'

'అది కాదండి... కొంచెం ఇబ్బందుల్లో ఉన్నాం. ఇంట్లో వారంరోజుల్నుంచి పిల్లి లేవటంలేదు. అనుకున్నవన్నీ తారుమారై పోయాయి. కొంచెం దయ చూపించా రంటే...'

'నా కదంతా తెలీదు, రేపు పదింటికల్లా బాకీ మొత్తం యివ్వకపోతే ఇల్లు జప్తు చేస్తాను చూసుకో.'

ఆ పరిస్థితులో వేరే గత్యంతరంలేక భగవంతునిమీద భారంవేసి ఊరుకుంటారు అప్పు తీర్చలేనివాళ్లు. అప్పు లిచ్చినవాళ్లు మాత్రం అలా వూరుకోరు. చెప్పినట్లల్లా ఇంటికి జప్తు వారంటు తెస్తారు...మాట విలకడ వుండాలిగా మరి,...

ఆపైన మనకు కనిపించేది - తింటానికి తిండిలేక వస్తువులంటున్న కుటుంబరావు పెళ్లాం బిడ్డలతో కట్టు గుడ్డలతో ఇల్లొదిలి చెట్టుక్రిందకు నడుస్తున్న దృశ్యం.

ఇలాంటి వెన్నో మనం చూస్తుంటాం వింటుంటాం. ఆ విధంగానే విన్నాడు రవణ మూర్తి.

* * *

ఉదయం ఐదింటికి అలవాటు ప్రకారం మెళకువ వచ్చింది రవణమూర్తికి.

ఒకసారి కళ్లు తెరచి చూసి పక్కమీద నుంచి లేవబోయినవాడల్లా, ఏదో గుర్తుకు వచ్చినట్లు ఆగిపోయాడు. మళ్లీ ముసుగు దన్ని పడుకున్నాడు.

ఏడవుతోందనగా రమణి వచ్చి నిద్ర లేపిందతన్ని.

అప్పుడే తలస్నానంచేసి, కురులారటానికి తలకు వాసిన గట్టి, మొహాన ఇంత బొట్టు పెట్టి, గరగరలాడుతున్న పట్టుచీరలో వచ్చిన రమణిని చూడగానే రవణ మూర్తి ముఖంలో ఆనందం వెల్లి విరియబోయి తక్కున ఆగిపోయింది.

'నన్నెందుకు నిద్ర లేపావు?'

'టైమెంతయిందో చూశారా?'

'నా కదంతా అనవసరం. నా యిష్టమొచ్చినంతసేపు నిద్రపోతాను. ఆ హక్కు, అవకాశం నాకున్నాయి. కాదనటానికి నీ వెవరివి?' కఠినంగా అన్నాడు రవణ మూర్తి.

రమణి విస్తుబోయింది భర్త ధోరణికి. తనకు తెలిసినంతలో రవణమూర్తి అంత కఠినంగా మాట్లాడటం ఎ ర గ దా మె, ముఖ్యంగా నిద్ర లేవడం విషయంలో.

భర్త మళ్లా కళ్లు మూసుకోవటం చూసి అక్కడ్నుంచి వెళ్లిపోయింది రమణి.

రమణి వెళ్లిపోయిన పదినిముషాలకల్లా లేచికూర్చున్నాడు రవణమూర్తి. అర గంటలో కాలకృత్యాలన్నీ ముగించుకుని, డైనింగ్ టేబులుదగ్గర కూర్చున్నాడు రమణి యాంత్రికంగా ఫలహారాల్ని తెచ్చి అతనిముందుంచింది. రవణమూర్తి కూడా ఏమీ మాట్లాడకుండా పెట్టినవన్ని తినేశాడు. కాఫీ కూడా ముగించుకుని వచ్చి ఆఫీసురూంలో కూర్చున్నాడు.

'గణపతీ!'

'సార్'

'లెడ్జరు తీసుకొచ్చావా?'

'చిత్తం'

రవణమూర్తి మనసులో ఒక విషయం మెఱుపులా మెరిసింది. గణపతి తెచ్చిన పుస్తకాన్నందుకుని పేజీలు తిరగేశాడు. ఒక పేజీదగ్గర ఆగిపోయి 'గణపతీ!' అని బిగ్గరగా అరిచాడు.

గుమాస్తా గణపతి హడలిపోయాడు. నిలువల్లా కంపించిపోతూ చేతులు కట్టుకుని నిల్చున్నాడు.

'మణిరెడ్డి తీసుకపోయిన పదివేల బాకీ అలాగే వుండిపోయిందేం?'

'చిత్తం'

'చిత్త మేమిటి నీ మొహం. అతను పెట్టిన గడువు తీరిపోయి ఎన్నాళ్లయింది. గడువు వెళ్లేలోపల నోటీసివ్వాలని తెలీదూ? ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తించినందుకు నిన్ను డిస్మిస్ చేస్తున్నాను.'

గణపతికి యజమాని ధోరణి క్రొత్తగా ధ్వనించింది. ఎన్నడూ పరుషంగా కూడా మాట్లాడని యజమాని ఒక్కసారిగా డిస్మిస్ చేస్తున్నాననేసరికి అతనికి నోట మాట రాలేదు.

'తమరు...' ఏదో చెప్పబోయాడు.

'ఏమిటది?' రవణమూర్తి గద్దించాడు.

'రెడ్డిగార్ని బాకీ విషయమై వత్తిడి చేయవద్దని తమరే సెలవిచ్చారు...'

'అదేం కుదరదు. వెంటనే బాకీ పరిష్కారం చేయమని నోటీసివ్వమను. లేకపోతే ఆడుమానం పెట్టిన పొలం వేలం వేయిస్తామని తెలియజేస్తూ నోటీసు తయారు చేయించమని మేనేజరుతో చెప్పు.

'చిత్తం' గణపతి వెళ్లిపోయాడు.

'రవణమూర్తిగారు దేవుడిలాంటి మనిషి ధర్మాత్ముడు' రవణమూర్తి నవ్వుకున్నాడు. ఇకమీదట తనకా బిరుదు వుండదు. తనలో యిన్నాళ్ళుగా స్థావరమేర్పరచుకున్న జాలి, దయ, దాక్షిణ్యాల్ని బయటికి తోలేసాడు తను. 'రవణమూర్తి కర్కోటకుడు, రక్తాన్ని పిండుకు తాగే దానవుడు.' అని వాడవాడలా తనను గురించి అనుకోవాలి.

రెండేళ్ల క్రితం సరిగ్గా ఇదేరోజుల్లో రెడ్డి తనదగ్గరికి వచ్చినట్లు గుర్తు వచ్చింది రవణమూర్తికి. అంతకుముందే రెడ్డి సంగతి వినివున్నాడు రవణమూర్తి. రెడ్డిదొక జాలి కథ. రెడ్డికి ఒక్కడే కొడుకు, ఒక్కతే కూతురు. కొడుకు విశాఖపట్నంలో మెడిసిన్ చదువుతున్నాడు. అతనికి పిల్లనిస్తామంటూ మంచి సంబంధ మొకటి వచ్చింది పదివేల కట్నమిస్తామని, ప్రాక్టీసు పెట్టుకోటానికి అన్ని సదుపాయాల్నీ కలుగ జేస్తామని పిల్ల తండ్రి అన్నాడు. కొడుకు పెళ్లిచేసి మిగిలిన కట్నం డబ్బుతో కూతురి పెళ్లిచేయాలని అన్ని ఏర్పాటున్నా చేసుకున్నాడు రెడ్డి. పెళ్లి పదిరోజులున్న దనంగా బస్సు ప్రమాదంలో కొడుకు చని పోయాడు. రెడ్డి కృంగిపోయాడు. కొడుకు మీద పెట్టుకున్న ఆశలన్నీ అణగారి పోయాయి. కొడుకు చదువుకి చేసిన ఐదు వేల అప్పూ, కూతురి పెళ్లి, సమస్యలై నిల్చున్నాయి. అనుకున్నప్రకారం కూతురి పెళ్లి జరుగకపోతే, ఆ తర్వాత మరో సంబంధం కుదురుతుందో లేదో నన్నభయం పట్టుకుంది. దూరం ఆలోచించాడు రెడ్డి. నెలరోజుల వ్యవధిలో కూతురిపెళ్లి స్థిరం చేశాడు. కొడుకు చదువుతున్నప్పుడు అప్పు లిచ్చినవాళ్లందరూ ఈసారి అప్పు పెట్టమన్నారు. రవణమూర్తి మాత్రం అతని పరిస్థితికి జాలిపడి తనకి వీలున్నప్పుడు అప్పు తీర్చమని రెడ్డికి పదివేలూ యిచ్చిపంపేడు.

మరి యిప్పుడు అప్పు తీర్చమని నోటీసు పంపితే ఏమనుకుంటాడో, ఎలా తీరుస్తాడో. రవణమూర్తికి సంతోషం కలిగింది. ఈ దెబ్బతో రెడ్డి బాగా చిక్కుల్లో పడిపోతాడు. అందుకు కారణమైన తనని

బాగా తిట్టిపోస్తాడు. అప్పుడు వెలుగురూ ఇంతవరకూ తనను పొగిడినవాళ్లే—తెగడటం ప్రారంభిస్తారు. ఓహ్ ... అదే తనకు కావలసింది... రమణమూర్తి కుర్చీలోనుంచి లేచాడు.

*    *    *

సాయంత్రం నాలుగయింది.

తూలుతూ గది బయటకొచ్చిన రమణమూర్తిని చూసి ఆశ్చర్యపోయింది రమణి. ఆమె గుండెలు వేగంగా కొట్టుకోడం మొదలెట్టాయి. ఉదయం నిద్రలేస్తూనే అతను మాట్లాడిన తీరు గుర్తుకొచ్చింది. ఆ తర్వాత గుమాస్తాపై కేకలెయ్యడం, డిస్మిస్ చేస్తానని బెదిరించడం తెలుసుకుంది. అవన్నీ అతని తత్వానికి విరుద్ధంగా కనుపించినా ఏదో చిరాకులో అలా ప్రవర్తించాడేమోనని సరిపెట్టుకుంది. కాని ఇప్పుడతను తాగినవాడిలా తూలుతూ కన్పించడంతో ఆమెలో భయం బాగా ఏర్పడింది. అతనిలో ఏదో మార్పు వస్తోంది. దాని కారణమేమిటో ఆమె గ్రహించలేకపోయింది.

రమణమూర్తి ఆగి రమణివైపు చూశాడు. అతను ఆమెకు దగ్గరగా వెళ్లి నిల్చున్నాడు. భయపడుతూనే అడిగింది రమణి.

'ఏమిటిలా వున్నారు ?'

'ఇకమీదట ఇలానే ఉంటాను.'

అతని మాటల్లో తొట్రుపాటు లేదు. మామూలుగానే మాట్లాడేడు. 'ఇపుడు నీవు చూసింది నటన మాత్రమే. ఇవాళ్టినుంచి నటన లేకుండా నిఖార్సయిన నిషాలో వుంటాను నిజం రమణీ.'

'ఏమిటండీ ఆ మాటలు. ఏమైంది మీకీవాళ. మీరెందుకిలా మారిపోతున్నారు?' ఆమె కళ్లు సజలాలైనాయి. రమణి కనుకొలకుల్లో నీరు చూడటం అదే మొదలు అతనికి. రమణమూర్తికి నవ్వు వచ్చింది. పెద్దగా నవ్వేడు. విరగబడి నవ్వేడు. ఆ నవ్వులోనే పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ టెలిఫోన్ దగ్గరకుపోయి నంబరు డైల్ చేశాడు.

'ఎవరు మేనేజరా ? ఎస్ నేను రమణమూర్తిని మాట్లాడుతున్నాను. గణపతిని డిస్మిస్ చేయమని పొద్దున చెప్పేను గుర్తుందా ? చిత్తమేమిటయ్యా, మెమో యింకా రాలేదేం. ఏమిటీ .....ఏదో పొరపాటా ? ఏదో పొరపాటేమిటి నాన్సెన్సు. క్షమించడమా. నో. వెంటనే మెమో తయారు చేయించండి. ఊఁ.'

రమణమూర్తి కారు దగ్గరకు నడిచాడు.

కారు మహా వేగంగా పోతోంది రోడ్డు మీద నడిచేవాళ్లు హడలిపోయి ప్రక్కకు తప్పుకుంటున్నారు. అంత వేగంగా వస్తున్న కారును చూసి బజారు బజారంతా నివ్వెరపోయింది.

అది ఫలాని రమణమూర్తిగారి కారని తెలిసిన జనం ముక్కుమీద వ్రేలు వేసుకున్నారు.

కారు బృందావన్ ముందు ఆగింది. రమణమూర్తి కారు దిగి లోపలకి నడిచేడు. రాబోయే ఆనందం అతనిలో అప్పుడే ప్రవేశించినట్లయింది. రమణమూర్తి సిగరెట్ వెలిగించుకుని సేరుగా చిట్టచివరి గదివైపు నడిచాడు. దానిపైన 'స్పెషల్' అని రాసివుంది. పెద్ద పెద్ద ఉద్యోగస్థులకి, బిజినెస్ మాగ్నెట్లకీ, పర్మిట్ హోల్డర్సుకు మాత్రమె ఆ స్పెషల్ వర్తిస్తుందని అతనికి తెలుసు. ధైర్యంగా వెళ్లి కూర్చున్నాడు లోపల.

బేరర్ వచ్చి చేతులు కట్టుకు నిల్చున్నాడు.

ఆ ఊళ్లో ప్రొహిబిషన్ ఉంది. కాని కొంతమందికి మాత్రం బృందావన్‌లో మందు దొరుకుతుంది. తను మందు తాగుతూ కూర్చున్నప్పుడు వూళ్లో వాళ్లంతా చూస్తే బావుండు ననిపించింది రమణమూర్తికి. కానీ ఆ గదిలో తనొక్కడే వున్నాడు. పోనీ ఈ బేరరైనా తనీరోజు క్రొత్తగా మందు పుచ్చుకున్న సంగతి తన స్నేహితులతో చెప్తే బావుంటుంది. అలి అలా వూరంతా పాకిపోతుంది తను మందు పుచ్చుకున్నాడనే వార్త. బేరర్ వైపు చూస్తూ 'బాదం డ్రింక్' అన్నాడు రమణమూర్తి.


బేరర్ ఆశ్చర్యంగా చూపి వెళ్లిపోయాడు.

సిగరెట్ క్రింద పడేసి కసిగా బూటు కాలుతో తొక్కేడు. తనమీద తనకే కోపం వచ్చింది రమణమూర్తికి. తను చేద్దామనుకున్నదేమిటి చివరకు చేసిందేమిటి? బేరర్ వచ్చేలోపలే విసురుగా లేచి బయటకు నడిచాడు రమణమూర్తి.

'కాఫీ తాగి వస్తున్నారా' ఎవడో పలకరించాడు.

అక్కడకి తను కేవలం కాఫీ తాగేవాడినని ఎగతాళి కాబోలు అనుకుని బాధపడ్డాడు రమణమూర్తి.

కారు ఆగటంతోనే నౌకరు పరుగెత్తుకు వచ్చాడు. కారు తలుపుతీసి పట్టుకుని రెండోచేత్తో సలాం చేశాడు. రోజులా చిరునవ్వు నవ్వకుండా కనీసం చూడనైనా చూడకుండా లోపలకు వెళ్తున్న ప్రొప్రయిటరువైపు ఆశ్చర్యంగా చూశాడు నౌకరు.



కుర్చీలో కూర్చొని బెల్ నొక్కాడు రమణమూర్తి. మేనేజరు ఏదో ఫైలుతో వచ్చి నమస్కారంచేసి నిల్చున్నాడు.

'ఏమిటి సంగతి మాట్లాడకుండా అలా నిల్చుంటారేం'

మేనేజరు నీళ్ళు నమిలేడు. గొంతు సరి చేసికొని 'మనం స్టెనో కావాలని అడిగాం కదండి. ఎక్ఛేంజీ వాళ్ళు ఒక కాండిడేట్‌ను పంపేరు. మధ్యాహ్నం రెండింటినుంచి మీ కోసం ఎదురు చూస్తున్నాం.'

'నాకు ఫోన్ ఎందుకు చేయలేదు?'

'చిత్తం...గణపతి...'

'మధ్య ఆ గణపతెందుకు. అతన్ని డిస్మిస్ చేయమన్నానుగా. ఆర్డరు టైప్ చేశారా!'

'అవుతోందండి.'

'దట్సాల్‌రైట్. నే నడిగిందానికి జవాబు చెప్పేరుకాదేం.'

'మీ రేదో చిరాగ్గా ఉన్నారని చెప్తే ఒంట్లో బాగాలేదనుకున్నాం.'

'షటప్...డోన్టాక్ నాన్సెన్స్. ఆ కాండిడేట్‌ను పంపించండి.'

మేనేజరు వెళ్ళిపోయాడు. కొన్ని

## మనిషి

క్షణాల్లో ఒక యువతి ఆ గదిలోకి వచ్చి రమణమూర్తికి నమస్కారంచేసి నిల్చుంది. రమణమూర్తి ఆమెను పరీక్షగా చూశాడు. ఆమె వయస్సు ఇరవై వుంటుంది. సింపుల్‌గానే అలంకరించుకొన్నా అందంగానే వుంది.

రమణమూర్తి ఏదో నిశ్చయించుకున్నాడు. 'మీ పేరు.'

చెప్పింది.

'ఏం చదువుకున్నారు?'

సర్టిఫికెట్లు చూపించింది. 'Previous Experience?'

లేదన్నట్లుగా తల ఊపింది.

'లేకపోతే మీ రిక్కడ అడ్జెస్టు కాలేరు.'

'నా శక్తికొద్దీ ప్రయత్నిస్తాను అడ్జెస్టు అవుతాననే నమ్మకం వుంది.'

రమణమూర్తి ఆలోచించాడు. 'అయితే డిక్టేషను తీసికోండి' కుర్చీలోంచి లేచాడు రమణమూర్తి.

ఆ అమ్మాయి పుస్తకం, పెన్నులతో రెడీగా కూర్చుంది.

రమణమూర్తి చెప్పుకుపోతున్నాడు. ఆమె రాస్తోంది

రమణమూర్తి చెప్పటం ఆపి ఆమెదగ్గరగా వచ్చి ఆమె భుజంపైన చేయివేసి 'రాశావా' అన్నాడు.

ఆమె తలూపింది.

'మీ కీ విషయం తెలుసా. ఉద్యోగంలో పైకి రావలసినవాళ్ళు ఆఫీసర్ని మంచి చేసుకుని మెప్పించాలి.'

ఆమె తలూపింది.

'ఇప్పుడు నీకు ఉద్యోగం రావాలన్నా నీవు నన్ను మెప్పించాలి.'

ఆమె తల దించుకుంది.

'దట్స్‌గుడ్' అతని ఎడంచేయి ఆమె నడుముకు చుట్టింది. అతని పెదాలు ఆమెను ముంచింపబోయాయి. ఆమె కళ్ళు మూసుకుని వెనుకకు వాలిపోయింది.

రమణమూర్తి తన చేతిని లాక్కున్నాడు. కంగారుగా కళ్ళు తెరచి చూచిందామె,

రమణమూర్తి కళ్ళు నిప్పులా వున్నాయి. 'మీ రీ ఉద్యోగానికి తగరు. వెళ్ళిపోవమ్మా' అన్నాడు.

'ఎందుకని.'

'అవినీతికీ మా ఆఫీసు స్థానంకాదు.

అమె నవ్వింది. 'మీరు అవినీతిగా ప్రవర్తించరని నాకు తెలుసు. మీ ఆఫీసులో అవినీతి ఉండదనీ తెలుసు. అందుకే మీకు లొంగిపోయినట్లు నటించాను. మీ డిక్టేషను టైపు చేసి తీసికొస్తాను' అంటూ వెళ్ళిపోయింది.

మేనేజరు ఒక పేడ్‌ను తీసుకొని వచ్చాడు. రమణమూర్తికి చిరాకేసింది. ఆ పేడ్‌లోని కాగితాలన్నీ ఒకసారి చూసి కోపంగా బయటకు లాగి ముక్కలు ముక్కలుగా చించేశాడు.

'అయ్యో...మణి రెడ్డికి పంపే నోటీసు, గణపతి డిస్మిసల్ ఆర్డర్సు వున్నయ్ సార్ అందులో.'

మేనేజరు నొచ్చుకున్నాడు.

'నెవర్‌మైండ్. ముందా అమ్మాయికి అపాయింట్‌మెంట్ ఆర్డరివ్వండి, క్విక్.'

మేనేజరు పోయింతర్వాత రెండుచేతులతో తల పట్టుకుని 'నేను ఓడిపోయాను. నేను దానవుడిగా మారలేను. నేను మనిషిని' అని గొణుక్కొన్నాడు రమణమూర్తి... ●

## మహీధరోక్తులు

మహీధర నళినీమోహన్‌రావు



దరిసెనంబు నీడు తిరుపతి వెంకన్న
కాసు చేతిలోన గానకున్న
దైవమంతవాడు ధన పిశాచికిలొచ్చు
హృదయవర్తి యీ మహీధరోక్తి